

బీసీ కార్పొరేషన్ కార్యాలయం

రుణాల విడుదల ఎప్పుడు?

- ఎస్సీ, బీసీ, ఈబీసీ నిరుద్యోగుల ఎదురుచూపులు
- మూడు నెలలైనా ప్రకటించని అర్హుల జాబితా

చిత్తూరు అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, బీసీ, ఈబీసీ నిరుద్యోగ యువకులు సబ్సిడీ రుణాల కోసం ఎదురు చూస్తున్నారు.ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో సబ్సిడీ రుణాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, మండలాల్లో ఎంపీడీవోల ఆధ్వర్యంలోని ఎంపిక కమిటీ సభ్యులు అర్హులను ఎంపిక చేశారు. మూడు నెలలైనప్పటికీ ఆ అర్హుల జాబితాను బీసీ కార్పొరేషన్ కార్యాలయానికి పంపలేదు.వైసీపీ హయాంలో ఐదేళ్లు సబ్సిడీ రుణాలను మంజూరు చేయకపోవడంతో పేద యువకులు స్వయం ఉపాధి రుణాలకు నోచుకోలేకపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ కార్పొరేషన్లకు సబ్సిడీ రుణాలను పునరుద్ధరించింది.

● మూడు నెలలైనా ప్రకటించని అర్హుల జాబితా

బీసీ కార్పొరేషన్‌తో పాటు ఈబీసీ కార్పొరేషన్, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్ల ద్వారా ఆయా సామాజిక వర్గాలకు చెందిన 3555మందికి రుణాలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఆమోదించింది. ప్రభుత్వ రాయితీగా రూ. 60కోట్లు, బ్యాంకు రుణంగా రూ. 60 కోట్లు విడుదల చేయనుంది. అలాగే ఎస్సీ కార్పొరేషన్ కింద 954మందికి ప్రభుత్వం సబ్సిడీ కింద రూ. 15.70 కోట్లు, బ్యాంకు రుణం కింద రూ. 2212కోట్ల విడుదల చేయనుంది. సబ్సిడీ రుణాలను ప్రభుత్వం మంజూరు చేస్తే నిరుద్యోగ యువకులు యూనిట్లను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంది. 2014-19 మధ్యకాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆదరణ పథకం కింద చేతివృత్తుల వారికి అవసరమైన పనిముట్లను పంపిణీ చేసింది.ప్రస్తుతం లబ్ధిదారుల ఇష్టానికి అనుగుణంగా యూనిట్లను ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. దీంతో పలువురు లబ్ధిదారులు ఆధునిక పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.2025-26వ ఆర్థిక సంవత్సరంలో మొదటి మూడు నెలలు గడిచిపోయాయని, ఇప్పుడూనా ప్రభుత్వం రుణాలను మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

● గ్రౌండింగ్ చేసినా ఫలితం లేదు

బీసీ కార్పొరేషన్ ద్వారా అన్ని సామాజికవర్గాలకు కలిపి 3555 యూనిట్లను మంజూరు చేయగా సుమారు 27వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఏప్రిల్ నెలలో 1200మంది లబ్ధిదారుల యూనిట్లను గ్రౌండింగ్ చేసింది. అయితే ఇంత వరకు గ్రౌండింగ్ అయిన లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బులు జమ కాలేదు. అలాగే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 954యూనిట్లకు గాను 15వేల మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి సంబంధించిన దరఖాస్తులన్నీ ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ల స్థాయిలోనే ఆగిపోయింది.


చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరైన యువత(ఫైల్ ఫొటో)

● వేగంగా టైలరింగ్ శిక్షణా కార్యక్రమం

బీసీ కార్పొరేషన్ ద్వారా నియోజకవర్గ కేంద్రాల్లో టైలరింగ్‌పై శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయి. మొత్తం 5533 మందికి 26 కేంద్రాల్లో శిక్షణ ప్రారంభంకాగా వాటిలో 60 రోజుల శిక్షణా కార్యక్రమాలు పూర్తయ్యాయి. మిగిలిన 30 రోజులు పూర్తయిన వెంటనే శిక్షణ పొందుతున్న మహిళలకు సర్టిఫికెట్లతో పాటు టైలరింగ్ యంత్రాన్ని ఉచితంగా పంపిణీ చేయనున్నారు.

స్వచ్ఛ తిరుపతి

దేశానికి ఆదర్శం కావాలి!

శ్రీవారి పాదాల చెంతకు హంద్రీ జలాలు

తిరుపతి ప్రజా వేదికలో సీఎం చంద్రబాబు

తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): దేశానికంతా పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి స్వచ్ఛతలో కూడా దేశానికి ఆదర్శం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. శనివారం మధ్యాహ్నం తిరుపతి పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రజా వేదికలో మాట్లాడుతూ, ఇటీవల కేంద్ర ప్రభుత్వం సూపర్ సిటీస్ కేటగిరీలో తిరుపతికి ఉత్తమ అవార్డు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. దేశం నలుమూలల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచీ కూడా భక్తులు శ్రీవారి దర్శనం కోసం తిరుపతి వస్తున్న నేపథ్యంలో నగరంలో పరిశుభ్రత ప్రతిఫలించాలని సూచించారు. నగరం శుభ్రంగా లేకుంటే భక్తులకు తిరుపతి మీద సదభిప్రాయం కలగదని హెచ్చరించారు. అవార్డుల్లో ఫైవ్ స్టార్ ర్యాంకింగ్ సాధించిన తిరుపతి భవిష్యత్తులో సెవెన్ స్టార్ ర్యాంకింగ్ సాధించాలని పిలుపునిచ్చారు.

రూ. 150 కోట్లతో మోడల్ సిటీగా తిరుపతి

గత ప్రభుత్వ నిర్వాకం వల్ల తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద పలు పనులు మిగిలిపోయాయని చంద్రబాబు గుర్తు చేశారు. ఆ ప్రాజెక్టు కింద పలు రోడ్లు, డ్రెయిన్ పనులు పెండింగులో వున్నాయన్నారు. రూ. 150 కోట్లతో తిరుపతిని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు ప్రకటించారు. దివ్యక్షేత్రంగా వున్న తిరుపతిని విద్యా కేంద్రంగానూ, నాలెడ్జి ఎకానమీ హబ్‌గానూ అభివృద్ధి చేస్తామన్నారు. శ్రీవారి పాదాల చెంత వివాహాలు చేసుకునే విధంగా వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తిరుపతిని మారుస్తామన్నారు. దానికోసం ఉత్తమ మౌళిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

జిల్లా రుణం తీర్చుకుంటా!

రూ. 3850 కోట్లతో 550 కిలోమీటర్ల మేరకు కాలువ తవ్వించి కుప్పం వరకూ హంద్రీ-నీవా జలాలు తెచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. తిరుపతి జిల్లాలో మల్లిమడుగుకు నీరు తెస్తామని, బాలాజీ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి దానికి నీటిని మళ్లిస్తామన్నారు. సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ ద్వారా నీటిని బాలాజీ రిజర్వాయర్‌కు తరలిస్తామన్నారు. అక్కడి నుంచి కాలువలు తవ్వించి మధ్యలో వేణుగోపాల సాగర్ నిర్మిస్తామని, ఆ రిజర్వాయర్ నింపడంతో పాటు హంద్రీ-నీవా జలాలను పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టుకు చేరుస్తామన్నారు. అదే విధంగా మంగళంపేట నుంచి మూలపేట చెరువు మీదుగా కళ్యాణి డ్యామ్‌కు నీరివ్వడం ద్వారా శ్రీవారి పాదాల చెంతకు హంద్రీ నీవా నీరు తెస్తామన్నారు. ఈ సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి జిల్లా రుణం తీర్చుకుంటానని సీఎం చంద్రబాబు ప్రకటించారు.


కపిలేశ్వర ఆలయాన్ని శుభ్రం చేస్తున్న చంద్రబాబు

కపిలేశ్వరాలయంలో 'స్వచ్ఛాంధ్ర'

పారిశుధ్య కార్మికులతో కలసి చెత్త ఊడ్చిన సీఎం

తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం తిరుపతిలోని కపిలేశ్వరాలయంలో పారిశుధ్య కార్మికులతో కలసి సీఎం చంద్రబాబు చెత్త ఊడ్చారు. ఆలయాన్ని శుభ్రం చేశారు. పారిశుధ్య కార్మికులతో సరదాగా ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తిరుపతికి నిత్యం లక్షమంది భక్తులు వస్తుంటారని, నగరం పరిశుభ్రంగా ఉంచాలంటే మీ చేతుల్లోనే ఉందన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కోసం అందరం కలిసి పనిచేయాలన్నారు. ఆలయ అర్చకుల యోగక్షేమాలపై ఆరాతీశారు. కపిలేశ్వరుడికి కైంకర్యాలు ఎంత పవిత్రంగా పనిచేస్తారో, ఆలయ పరిసరాలు కూడా అంతే పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. అనంతరం కపిలేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.




కంచి పీఠాధిపతి విజయేంద్రసరస్వతితో చంద్రబాబు

సీఎం చంద్రబాబు ప్రజావేదిక ప్రాంగణంలోకి అడుగుపెట్టింది మొదలు వెనుదిరిగే వరకూ యువత, మహిళలు నినాదాలు, చప్పట్లు, ఈలలు, కేకలతో హోరెత్తించారు. సీఎం ప్రాంగణంలోకి వచ్చి స్టాల్స్ పరిశీలిస్తున్నంత సేపూ ఆ దృశ్యాలు వేదిక పక్కన ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. వాటిని చూస్తూ జనం

ఉరకలెత్తిన యువత

హర్షధ్వానాలు చేశారు. సీఎం వేదిక మీదకు వచ్చాక ఆయన ప్రసంగం కొనసాగినంత సేపూ ఈలలు, కేకలు, నినాదాలతో పాటు ప్లకార్డులు చూపుతూ సందడి చేశారు. ప్రజలను ప్రశ్నించి సమాధానాలు రాబట్టేందుకు యత్నించినప్పుడల్లా రెట్టింపు ఉత్సాహంతో జనం స్పందించారు. ప్రజావేదికలో పాల్గొన్న వారిలో అత్యధికులు మహిళలు, విద్యార్థులే కావడంతో కార్యక్రమం కొనసాగినంత సేపూ వారి కేరింతలతో ప్రాంగణం మార్మోగింది. వారి స్పందన చూసి సీఎం సైతం అంతే ఉత్సాహంతో ప్రసంగాన్ని కొనసాగించారు.

"వైసీపీ ప్రభుత్వంలో తిరుపతి ప్రజలు ఏనాడైనా ప్రశాంతంగా నిద్రపోయారా? తిరుపతి నగరప్రజలకు తెలుగు గంగ నీరిచ్చింది ఎవరు? నగరానికి గరుడ వారధి తెచ్చింది ఎవరు? తిరుపతిలో పాతుకుపోయిన రౌడీలను నిర్మూలించి వారి గుండెల్లో నిద్రపోయిన పార్టీ తెలుగుదేశం"

తిరుపతి నగరం అధ్యాత్మిక క్షేత్రంగానే కాకుండా ఆర్థికంగానూ ఎదగాలి. భారతదేశానికి ఆదర్శం కావాలి.


పారిశుధ్య కార్మికులకు మెమెంటోలు అందిస్తున్న ముఖ్యమంత్రి

ప్రజావేదికలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, పొంగూరు నారాయణ, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, తిరుపతి, శ్రీకాళహస్తి, నగరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, గాలి భానుప్రకాష్, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, మీడియా కో ఆర్డినేటర్ శ్రీధరవర్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నేతలు కోడూరు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్య ఘర్షణపై కేసు

చిత్తూరు అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. ఇటీవల చిత్తూరు నాయుడు బిల్డింగ్స్ సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో శంకరయ్యగుంటకు చెందిన కొంతమంది విద్యార్థులు నగరానికి చెందిన సతీష్, హర్షద్, హేమచంద్ర అనే విద్యార్థులను కిడ్నాప్ చేసి.. కాజూరు వద్దకు తీసుకెళ్లారు. అక్కడ ముగ్గురు విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టడంతోపాటు, వారిని అర్ధ నగ్నంగా నిలబెట్టి వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తామని బెదిరించారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో హేమచంద్ర తండ్రి చంద్రబాబు ఇచ్చిన ఫిర్యాదుతో శంకరయ్యగుంటకు చెందిన కొంతమందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'ఓపెన్' విద్యార్థులకు స్పీడ్ పోస్టులో సర్టిఫికెట్లు

చిత్తూరు సెంట్రల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ ద్వారా 2025 మేనెలలో పరీక్షలు రాసి.. ఉత్తీర్ణులైన టెన్త్, ఇంటర్ విద్యార్థులకు స్పీడ్ పోస్టు ద్వారా ఇంటి చిరునామాకే సర్టిఫికెట్లు పంపినట్లు డీఈవో వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాస్ సర్టిఫికెట్‌తోపాటు మైగ్రేషన్ కమ్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు ఏపీ సార్వత్రిక విద్యాపీఠ నుంచి పంపారన్నారు. పాసైన విద్యార్థులు స్పీడ్ పోస్టు నెంబరుతో పోస్టాఫీసులో వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

22న కడా కార్యాలయంలో ఉద్యోగ మేళా

కుప్పం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ యువతకు ఉద్యోగ కల్పన కోసం 1ఎం1బి గ్రీన్ స్కిల్ అకాడమీతో కలిసి కడా (కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ఆధ్వర్యంలో ఈనెల 22న కడా కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. ఇందులో పాల్గొనాలంటే ఈనెల 21వ తేదీన జరిగే ప్రీ స్క్రీన్ టెస్ట్‌లో పాల్గొని ఇంటర్వ్యూ, ప్రాసెసింగ్ ట్రైనింగ్ తీసుకోవాలన్నారు. ఐబీఎఫ్ఎస్టీ సేల్స్, తయారీ, రిటైల్, టెలికాం, ఎడ్యుకేషన్ ఐటీ/ఐటీఈఎస్ వంటి ఎన్నో కంపెనీలు ఉద్యోగాలు ఆఫర్ చేస్తున్నాయని చెప్పారు. 10, 12 తరగతులు, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చదివిన వారు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైనవారు కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పూణె వంటి రాష్ట్రాలలో విధులు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వేతనం నెలకు రూ.14 వేల నుంచి రూ.60 వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు కడా కార్యాలయంలో ఈనెల 21న ముందుగా జరిగే స్క్రీన్ టెస్ట్‌కు, అక్కడ ఎంపికైనవారు, 22న అదే కార్యాలయంలో జరిగే జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు. ఇతర వివరాలకు ప్లేస్‌మెంట్ అధికారి ప్రకాశ్, ఫోన్‌నంబర్ 9110652990ను సంప్రదించాలని పీడీ కోరారు.

మోడల్ స్కూళ్లుగా 35 బడుల అప్‌గ్రేడ్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): 'కుప్పం నియోజకవర్గ పరిధిలోని 35 ప్రాథమిక పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వాటి నిర్మాణపనులు వందరోజుల్లోపు పూర్తిచేయాలి' అని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి కుప్పం నియోజకవర్గానికి మంజూరైన మోడల్‌స్కూల్స్ నిర్మాణపనుల పురోగతిపై ఎంఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాలవారీగా కుప్పానికి పది, శాంతిపురానికి ఎనిమిది, గుడుపల్లెకు ఏడు, రామకుప్పానికి పది మోడల్ స్కూల్స్ పనులు మంజూరయ్యాయన్నారు. నిర్మాణ పనులను సమగ్రశిక్ష, ఏపీఈడబ్ల్యూఐడీసీ, పంచాయతీరాజ్ శాఖలకు కేటాయించామన్నారు. ప్రతి పాఠశాలలో ఐదు తరగతి గదులు, ఐదుగురు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. నిర్మాణ పనులకోసం రూ.10.36 కోట్లు మంజూరు అయినట్లు తెలియజేశారు. ప్రతి పాఠశాలకు ఆర్వో ప్లాంట్, తలుపులు, డెస్కులు వంటి సామగ్రి కొనుగోలుకు కడా పీడీ, సమగ్ర శిక్ష (ఎస్ఎస్) ఏపీసీలు చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్మాణ పనులు 25శాతం పూర్తయిన వెంటనే ఎంబుక్కులను తయారుచేసి ఎస్ఎస్ ఏపీసీకి పంపాలని ఆదేశాలిచ్చారు. కడా పీడీ వికాస్ మర్మత్, డీఈవో వరలక్ష్మి, ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణ, ఈఈ మధుసూదన్ రావు, ఏపీఈడబ్ల్యూఐడీసీ, పీఆర్ శాఖల ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్లాస్టిక్‌రహిత జిల్లాగా చిత్తూరు

కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరును ప్లాస్టిక్ రహితజిల్లాగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. మూడో శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా 'స్వచ్ఛత - ప్లాస్టిక్ నిర్మూలన' కార్యక్రమం జిల్లా అంతటా జరిగింది. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని చెత్తాచెదారాలను వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, సెక్షన్ల ఆఫీసర్లు, సిబ్బంది, డీఆర్వో మోహన్‌కుమార్‌తో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను కలెక్టర్ చేయించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిలిపి. జూట్ బ్యాగులను వినియోగిస్తూ కలెక్టరేట్ సిబ్బంది అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. ప్లాస్టిక్ నిర్మూలన - జ్యూట్ బ్యాగులు, స్టీల్ వాటర్ బాటిళ్ల వినియోగంపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు.

భవితకు 'బంగారు' విజన్: చంద్రబాబు

● రెండు కుటుంబాల మొర ఆలకించిన సీఎం ● బిడ్డల చదువుకు ముందుకొచ్చిన మార్గదర్శులు

బాగా చదివే బంగారంలాంటి పిల్లలు. కానీ చదివించే స్థోమతే లేదు. అలాంటి రెండు నిరుపేద కుటుంబాల ఆవేదనను సీఎం చంద్రబాబు విన్నారు. వారి చదువుకు సాయం అందించేందుకు రోటరీ క్లబ్, రాస్ సంస్థలు మార్గదర్శులుగా ముందుకొచ్చాయి. ఇలాంటి పిల్లలకు 'బంగారు' భవితను అందించే విజన్‌కు సంబంధించి బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో శనివారం తిరుపతిలోని పోలీసు పరేడ్ మైదానంలో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ ప్రయత్నం ఇంతటితో ఆగదని, తానేకాదు... తెలుగు దేశం పార్టీ ఉన్నంత వరకు ఈ పి4 కార్యక్రమం సాగుతుందని స్పష్టం చేశారు.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

● సర్, నా బిడ్డలను చదివిస్తే చాలు

నాపేరు కె.ఈశ్వరి. తిరుపతి నగరం సింగాలగుంట. అనారోగ్యంతో నా భర్త మృతి చెందారు. నా కుమారులు రాహుల్ 8వ, చైతన్య 5వ తరగతి చదువుతున్నారు. వాళ్లు బాగా చదువుతున్నా.. చదివించే స్తోమత నాకులేదు. నా బిడ్డల చదువుకు సాయం చేయండి.

- ఇదీ ఓ బంగారు తల్లి అభ్యర్థన

ముందుకొచ్చిన 'రాస్'



ఏమ్మా తల్లికి వందనం ఇద్దరు బిడ్డలకూ వచ్చిందా అని సీఎం చంద్రబాబు కుమారిని అడగ్గా వచ్చిందని చెప్పారావె ం. గతంలో ఒకరికే ఇచ్చేవారని, ఇప్పుడు పిల్లలందరికీ ఇస్తున్నామని చెప్పారు. ఈశ్వరి కుటుంబానికి సాయం అందించేందుకు 'రాస్' ముందుకు వచ్చిందంటూ ఆ సంస్థ ప్రతినిధిని పరిచయం చేశారు. 'ఈ ఇద్దరి పిల్లలకు 'రాస్' మంచి విద్యను అందించి ప్రయోజకులను చేస్తుంది. బ్యూటీషియన్ కోర్సుపై ఈశ్వరి ఆసక్తి చూపుతున్నందున, ఆమెకు శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పిస్తాం. సీఎం చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం ద్వారా ఇలా సాయపడే అవకాశం రాస్‌కు కలిగినందుకు సంతోషంగా ఉంది' అని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు.

● సర్.. సాయం అందిస్తే డాక్టరవుతా

నాపేరు వినిత. మాది తిరుపతి నగరం గిరిపురం. బైపీసీ చదివాను. వెయ్యికి 986 మార్కులు సాధించా. నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుని మెడిసిన్ చదవాలన్నది నా ఆశయం. మా నాన్న డి.హరిబాబు 2021లో కరోనాతోను.. అంతకుముందే అమ్మ నాగ సులోచన అనారోగ్యంతో మృతిచెందారు. నాన్నమ్మ, తాతయ్య కష్టపడి ఎలాగోలా ఇప్పటివరకు నన్ను, చెల్లెలు అనిత, తమ్ముడు గణేష్‌ను చదివించారు. నేను డాక్టర్ అవ్వాలి. ఇంటర్ చదువుతున్న చెల్లెలు, టెన్త్ చదువుతున్న తమ్ముడికేమో సివిల్స్ సాధించి సమాజానికి సేవ చేయాలనే ఆకాంక్ష ఉంది. మీరు మాకు సాయంచేస్తే ఉన్నత స్థానానికి చేరి మాలాంటి వారికి సాయం అందిస్తాం.

- ఇదీ సీఎం చంద్రబాబుతో ఓ బంగారు బిడ్డ మాట.

సమాజాన్ని భాగస్వామ్యం చేస్తే..



'ఇది బంగారు కుటుంబం. తల్లిదండ్రులు లేకపోయినా కష్టపడి బాగా చదువుతున్నారు. పైచదువులు చదివే స్తోమత వారికి లేదు. ఇలాంటి వారెందరో ఉన్నారు. నేను సాయంచేస్తే ఒకరో ఇద్దరికో చేయగలను. కానీ, సామాజిక బాధ్యత కలిగిన వారిని భాగస్వాములను చేస్తే.. మరెందరికో సాయం అందించి మార్గదర్శులుగా నిలుస్తారు. వారి అండతో ఉన్నత శిఖరాలకు చేరినవారు మరో పదిమందికి సాయం అందించి సమాజాన్ని తీర్చిదిద్దుతారు. అందుకే 'బంగారు కుటుంబం.. మార్గదర్శి' కార్యక్రమం నా మదిలో మెదిలింది. ఆ ఆలోచనకు అనుగుణంగా వినిత బంగారు కుటుంబానికి చేయూతనిచ్చేందుకు ఓ మార్గదర్శి ముందుకు వచ్చారు' అంటూ వినితను, ఆమె చెల్లెలు, తమ్ముడిని వేదికపై నుంచి సీఎం చంద్రబాబు చూపుతూ మాట్లాడారు.

మంచి వేదికను ఇచ్చారు

వినిత కుటుంబానికి సాయం అందించే మార్గదర్శిగా తిరుపతి రోటరీ క్లబ్ అధ్యక్షుడు కె.రాజేంద్రశెట్టి ముందుకొచ్చారు. 'సాయం చేయాలని చాలామందికి ఉంటుంది. దానికి ఓ వేదికంటూ లేకపోవడంతో ఎవరికి సాయం చేయాలన్నది అర్థంకాని విషయంగా ఉంటుంది. ముఖ్యమంత్రి విజన్‌లో భాగంగా రూపొందిన ఈ కార్యక్రమం అందుకు చాలా ఉపకరిస్తుంది. సాయం కావాల్సిన వారు.. అందించేవారు ముందుకొస్తారు. దీని ద్వారా భవిష్యత్తులో అణగారిన వర్గాలు అభివృద్ధిలోకి వస్తాయి. వినిత, ఆమె చెల్లెలు, తమ్ముడి చదువు బాధ్యతను తిరుపతి రోటరీ క్లబ్ భరిస్తుంది' అని చెప్పారు.

కాణిపాకంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిద్దాం



దుకాణంలో ప్లాస్టిక్ కవర్లను పరిశీలిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిద్దామని ఆలయ ఈవో పెంచలకిషోర్ పిలుపునిచ్చారు. దీనిపై శనివారం ఆలయం వద్ద అధికారులు, సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయశాఖ ఆదేశాలతో ఆలయ పరిసరాల్లో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామి దర్శనార్థం విచ్చేసే భక్తులు కూడా తాము వినియోగించిన ప్లాస్టిక్ వస్తువులను ఎక్కడ బడితే అక్కడ పారేయకుండా చెత్తకుండీల్లోనే వేయాలని కోరారు. హోటల్, దుకాణ యజమానులు డీగ్రేడబుల్ కవర్లను వినియోగించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ధనంజయ, ఎస్వీ కృష్ణారెడ్డి, ధనపాల్, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.

1,300 గ్రాముల గంజాయి స్వాధీనం

- ఐదుగురు విక్రేతల అరెస్టు



పట్టుబడ్డ నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో 1,300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు విక్రేతలను అరెస్టు చేశారు. శనివారం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఎస్‌ఐ రమేష్‌బాబుతో కలిసి సీఐ నెట్టికంఠయ్య మీడియాకు వివరాలు తెలిపారు. ఇటీవల చిత్తూరులోని కాలేజీ, బస్టాండు, శివారు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నారని ప్రజల నుంచి పలు ఫిర్యాదులు పోలీసులకు అందాయి. దాంతో గంజాయి రవాణా, విక్రయాలు, సాగుపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. శుక్రవారం కైలాసపురం వద్ద గంజాయి అమ్ముతున్నారని పోలీసులకు వచ్చి పక్కా సమాచారంతో దాడులు చేశారు. ఈ దాడుల్లో చిత్తూరుకు చెందిన తులసి, జోసఫ్, శివ, నందకుమార్, హరీష్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1,300 గ్రాముల గంజాయిని సీజ్ చేశారు. వీరికి నగరానికే చెందిన రాజు, తులసి గంజాయి సరఫరా చేస్తారని విచారణలో తేలిందన్నారు. వీరిని కూడా త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు. ఇక పట్టుబడ్డ ఐదుగురినీ కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామన్నారు.

డీఈఈ సెట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన



అభ్యర్థినికి సూచనలిస్తున్న అధికారి

వెదురుకుప్పం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో 18మంది డీఈఈ సెట్ అభ్యర్థుల సర్టిఫికెట్లను శనివారం పరిశీలించినట్లు ప్రిన్సిపాల్ వరలక్ష్మి తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ దామోదరరావు, అధ్యాపకులు నాగరాజునాయక్, దశరథుడు, మునికృష్ణ, సూపరింటెండెంట్ కృపావతి తదితరులు పాల్గొన్నారు.

భార్యను హతమార్చి.. ఆత్మహత్య

● దంపతుల విషాదాంతంతో అనాథలైన చిన్నారులు





హతురాలు ఉష -ఆత్మహత్య చేసుకున్న లోకేశ్వర్

తిరుపతి(నేరవిభాగం), జూలై 19(ఆంధ్రజ్యోతి): స్పర్థల నేపథ్యంలో భార్యను హతమార్చి తానూ ఆత్మహత్య చేసుకున్నాడో వ్యక్తి. తిరుపతి రూరల్ మండలం మంగళం రిక్షా కాలనీలో శనివారం జరిగిన ఈ ఘటనతో పిల్లలు అనాథలయ్యారు. సీఐ సునీల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ బొమ్మల క్వార్టర్స్‌కు చెందిన ఉష(34)కు గంగాధర నెల్లూరు మండలం ఠాణాకు చెందిన లోకేశ్వర్‌తో 15 ఏళ్ల క్రితం పెళ్లయింది. వీరికి తొమ్మిదవ తరగతి చదువుతున్న కుమారుడు, ఏడవ తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారు. ఉష కరకంబాడిలోని అమరరాజా ఫ్యాక్టరీలో పనిచేసేది. లోకేశ్వర్ కాంట్రాక్టు ప్రాతిపదికన టెక్నీషియన్‌గా పనిచేసేవాడు. కొంతకాలంగా ఈ దంపతుల మధ్య స్పర్థలు ఏర్పడ్డాయి. గొడవలతో ఆమె పలుసార్లు పుట్టింటికి వెళ్ళిపోయేది. ఇటీవల గొడవలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. ఈక్రమంలోనే గత నెల 30న ఉష పుట్టింటికి వెళ్ళి పోయింది. లోకేశ్వర్ అక్కడే చిన్న గది అద్దెకు తీసుకుని ఉండేవాడు. ఈనేపథ్యంలో అతను భార్యను హతమార్చాలని పథకం పన్నాడు. శనివారం ఉదయం 5 గంటలకు డ్యూటీకి వెళ్లేందుకు కంపెనీ బస్సు కోసం వస్తున్న ఉషపై కత్తితో దాడి చేశాడు. గొంతుకోసి పరారయ్యాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తర్వాత లోకేశ్వర్ ఇంటికి వెళ్ళి తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు మృతి చెందడంతో పిల్లలిద్దరూ అనాథలుగా మిగలడం స్థానికులను కలచివేసింది. ఘటనా స్థలాన్ని అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి పరిశీలించారు. మృత దేహాలను రుయాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గడ్డి సాగుకు యూరియా విక్రయించం

చిత్తూరు సెంట్రల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గడ్డి సాగుకు కూడా రైతులు యూరియా కొనుగోలు చేయడం ద్వారానే జిల్లాలో యూరియా కొరత ఏర్పడిందని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. గడ్డికి యూరియా విక్రయించడం లేదని వివరించారు. గడ్డి సాగుకు యూరియా అమ్మరాదని ఎరువుల డీలర్లకు ఆదేశాలు కూడా ఇచ్చామన్నారు. ఇటీవల బంగారుపాళ్యం మండలంలో మన గ్రోమోర్ కేంద్రం వద్ద క్యూ కట్టిన రైతులు గడ్డి సాగుకు యూరియా కోసం వచ్చారని విచారణలో తేలినట్లు పేర్కొన్నారు.

నేటి ఏపీపీఎస్సీ పరీక్షలకు హాజరు కానున్న 660మంది అభ్యర్థులు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో లెక్చరర్ల పోటీపరీక్ష ఆదివారం జిల్లాలో నిర్వహించనున్నట్లు డీఆర్వో మోహన్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పరీక్షల నిర్వహణకు సంబంధించిన అధికారులతో సమీక్షించారు. పాలిటెక్నిక్, జూనియర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్షలు జరుగుతాయని చెప్పారు. 660మంది అభ్యర్థుల కోసం నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. చిత్తూరు - తిరుపతి రహదారిలోని శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ స్టడీస్ - సీటమ్స్ (మురకంబట్టు), శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ - ఎస్వీసెట్ (ఆర్వీఎస్ నగర్), వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (తిరుపతి హైవే), మదర్ థెరిస్సా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (పలమనేరు) కళాశాలలను కేంద్రాలుగా గుర్తించామన్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్ష కేంద్రాల్లోకి మధ్యాహ్నం 1.30 గంటల నుంచే అభ్యర్థులను అనుమతిస్తామన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో లైజన్ ఆఫీసర్లు, పోలీసు, ట్రాన్స్‌కో, మెడికల్ అండ్ హెల్త్, ఆర్టీసీ, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

18 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి):మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతాంగానికి ఊరట కలిగిస్తున్నాయి.ఖరీఫ్ కింద వర్షాధార వేరుశనగ పంట సాగుకు ఈ వానలు ఉపయోగపడతాయని రైతులకు వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. వరినాట్లకు అదను కావడంతో స్వల్పకాలిక విత్తనాలతో వరినార్లు వేసుకుంటే మంచి దిగుబడి వస్తుందంటున్నారు. కాగా జిల్లావ్యాప్తంగా 24 గంటల్లో అల్పపీడన ద్రోణి ప్రభావంతో 18 మండలాల్లో వర్షం కురిసింది. మండలాలవారీగా.. పూతలపట్టులో 34.6, రొంపిచెర్లలో 31.6, పెనుమూరులో 16.2, చిత్తూరు రూరల్‌లో 12.8, సదుం, పులిచెర్ల మండలాల్లో 8.4, నిండ్రలో 6.2, వెదురుకుప్పంలో 5.4, పాలసముద్రంలో 4.2, యాదమరిలో 3.8, శ్రీరంగరాజపురంలో 3.4, చిత్తూరు అర్బన్, కార్వేటినగరం, గుడిపాల మండలాల్లో 2.6, తవణంపల్లెలో 2.2, గంగాధర నెల్లూరులో2, గంగవరం, బంగారుపాళ్యం మండలాల్లో 1.2 మి.మీ వర్షం కురిసింది.

వైసీపీ రాష్ట్ర కార్యదర్శుల నియామకం

తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలువురు వైసీపీ నాయకులు పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా నియమితులయ్యారు. తిరుపతి పార్లమెంటు పరిధిలో.. పెళ్ళకూరుకు చెందిన కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సత్యవేడుకు చెందిన డి.బీరేంద్ర వర్మ, ఓడూరు గిరిధర్‌రెడ్డి, కోడూరు కల్పలతా రెడ్డి, చిత్తూరు పార్లమెంటులో.. పుంగనూరుకు చెందిన ఎన్.అనీషారెడ్డి, ఎన్.వెంకటరెడ్డి యాదవ్, పెనుమూరుకు చెందిన మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి, బైరెడ్డిపల్లికి చెందిన మొగసాల కృష్ణమూర్తి నియమితులయ్యారు. వీరు రాష్ట్ర కార్యదర్శులైనా సంబంధిత పార్లమెంటు నియోజకవర్గాలకే వీరి కార్యకలాపాలు పరిమితమై వుంటాయి. పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుని అసెంబ్లీ సెగ్మెంట్లలో రీజనల్ కో ఆర్డినేటర్లకు, పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులకు సహాయకులుగా వ్యవహరిస్తారని వైసీపీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది.

లారీని ఢీకొన్న టెంపో

● ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న టెంపో, లారీ



మృతిచెందిన టెంపో డ్రైవర్ వెంకటేష్

శాంతిపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలోని శాంతిపురం మండలం పోడూరు వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా కిడియూరుకు చెందిన లారీ పలమనేరు వైపు వెళుతూ పోడూరు వద్ద ఆగింది. లారీ మరమ్మతలకు గురికావడంతో డ్రైవర్ పరిశీలిస్తున్నాడు. అదే సమయంలో సత్యసాయి జిల్లా తనకల్లుకు చెందిన టెంపో మామిడికాయల లోడుతో తమిళనాడుకు వెళ్తూ పోడూరు వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొంది. ప్రమాదంలో టెంపో డ్రైవర్ వెంకటేష్(23) అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్ వెంకటాద్రి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గాయపడిన వెంకటాద్రిని 108 వాహనంలో కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం వందపడకల ఆస్పత్రికి తరలించారు. రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని వ్యాపారి దుర్మరణం

● మరొకరికి తీవ్రగాయాలు



రాజారెడ్డి (ఫైల్ ఫొటో)

రామకుప్పం/శాంతిపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లె శివార్లలో శనివారం రాత్రి హంద్రీ-నీవా కాలువ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందగా.. మరొకరు గాయపడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. రామకుప్పం పట్టణానికి చెందిన రాజారెడ్డి (36) దశాబ్దన్నర కాలంగా శాంతిపురం మండల సచివాలయం ఎదురుగా ఫొటో స్టూడియో, జిరాక్స్ సెంటరును నడుపుకుంటున్నాడు. శనివారం ఉదయం శాంతిపురం వెళ్లి రాత్రి ద్విచక్రవాహనంలో రామకుప్పం వస్తుండగా మార్గమధ్యలో గుండిశెట్టిపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో రాజారెడ్డి తారురోడ్డుపై పడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. అదే సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ వస్తున్న శాంతిపురం మండలం ఎంకేపురానికి చెందిన మునస్వామిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని చికిత్స కోసం 108 వాహనంలో కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు.


పులివర్తివారిపల్లెలో ముగిసిన లక్ష్మీభారతి అంత్యక్రియలు



తల్లి లక్ష్మీభారతి అంత్యక్రియలను నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తల్లి లక్ష్మీభారతి అంత్యక్రియలు పులివర్తివారిపల్లెలో శనివారం నిర్వహించారు. చిత్తూరులోని స్వగృహంలో శుక్రవారం ఉదయం లక్ష్మీభారతి కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆమె పార్థివదేహాన్ని ఎమ్మెల్యే స్వగ్రామం పులివర్తివారిపల్లెకు తీసుకువచ్చారు. శనివారం మధ్యాహ్నం పులివర్తివారిపల్లెలోని వ్యవసాయక్షేత్రంలో నిర్వహించిన అంతిమ సంస్కార కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు, టీడీపీ నాయకులు, బంధుమిత్రులు, గ్రామస్థులు హాజరై నివాళులు అర్పించారు.

రాజనాలబండలో ప్రమాణం అనగానే చోరీ నగలు ప్రత్యక్షం



లభించిన ప్రసాద్ బంగారు నగలు

చౌడేపల్లె, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో సత్య ప్రమాణం అనగానే చోరీకి గురైన బంగారు నగలు శనివారం ప్రత్యక్షమయ్యాయి. మదనపల్లె నియోజకవర్గం వలసపల్లెకు చెందిని గంగాదేవి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవించేది. గంగాదేవి 15 రోజుల క్రితం తన పూజ గదిలో దేవుడి ఫొటో వెనుక ఉంచిన తన చెవి హారాలు చోరీకి గురయ్యాయి. చుట్టుపక్కల వారిని విచారించినా నగల ఆచూకీ లభించలేదు. గ్రామస్తుల సూచన మేరకు సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో చుట్టుపక్కల ఇళ్లవారిని సత్యప్రమాణానికి రావాలని ఆమె కోరింది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం పూజ గదిలోని దేవుడి ఫొటో సమీపంలో చోరీకి గురైన బంగారు చెవి చెంప హారాలు లభించాయి. అలాగే సోమల మండలానికి చెందిన ప్రసాద్ ఇంట్లో బంగారు గొలుసు నెల క్రితం చోరీకి గురైంది. దీంతో రాజనాలబండ ఆలయ నిర్వాహకుల వద్ద అనుమతి తీసుకొని నెల క్రితం గ్రామస్తులు సత్యప్రమాణం చేశారు. అయితే శనివారం ఉదయం ప్రసాద్ ఇంటి వద్ద చోరీకి గురైన బంగారు చైను గుడ్డలో కట్టి గుర్తు తెలియని వ్యక్తులు వేశారు. ఉదయాన్నే తన చోరీ అయిన బంగారు చైను లభించింది. స్వామివారి కృపతోనే చోరీకి గురైన బంగారు నగలు లభించటంతో వారు స్వామివారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చోరీకి గురై తిరిగి లభించిన గంగాదేవి బంగారు నగలు

కేఈసీ విద్యార్థులకు డిజిటల్ నైపుణ్య శిక్షణ



పత్రాలు అందుకుంటున్న ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, హెచ్‌వోడీ గణేశ్

కుప్పం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణ పొందే అవకాశం లభించింది. సద్రే ఫౌండేషన్, ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ - నాస్కాం భాగస్వామ్యంతో నిర్వహించిన డిజిటల్ స్కిల్లతాన్ కార్యక్రమాన్ని కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, మెకానికల్ ఇంజనీరింగ్ శాఖాధిపతి కె.గణేశ్ శనివారం విజయవంతంగా పూర్తి చేశారు. విద్యార్థులకు అవసరమైన డిజిటల్ నైపుణ్యాలను అందించడంలో భాగంగా ఆన్‌లైన్ మాడ్యూళ్లు, నేరుగా తరగతులను మిశ్రమ పద్ధతిలో బోధన అందించారు. డిజిటల్ యుగంలో భవిష్యత్తులో విజయవంతమైన నిపుణులను తయారు చేయడంలో కేయిూసీ వేసిన మొదటి అడుగుగా ఈ శిక్షణను కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు అభివర్ణించారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబుకు, మెకానికల్ ఇంజనీరింగ్ శాఖాధిపతి గణేశ్‌లకు జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య ప్రశంసా పత్రాలు అందజేశారు.

నాని తల్లికి కుప్పం నేతల నివాళి



నివాళులర్పిస్తున్న పీఎస్ఎం

కుప్పం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి శాసన సభ్యులు పులివర్తి నాని తల్లి భౌతిక కాయానికి శనివారం ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ నాయకులు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, సత్యేంద్రశేఖర్, డాక్టర్ వెంకటేశ్, బీఎంకే. రవిచంద్రబాబు నివాళులర్పించారు. ఎమ్మెల్యే పులివర్తిని నానిని పరామర్శించి సానుభూతి తెలిపారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగులకు చికిత్సలు చేస్తున్న వైద్యులు

శాంతిపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : శాంతిపురంలోని నందిగం కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శాంతిపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగళూరు వైదేహి ఆస్పత్రి, శాంతిపురం మురుగేష్ క్లినిక్, ధాన్విక డెంటల్ ఆస్పత్రి వారు సంయుక్తంగా వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 500 మంది వివిధ చికిత్సలు పొందారు. కార్యక్రమంలో శాంతిపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నందిగం ఉదయకుమార్ నాయుడు, సభ్యులు విజయరామిరెడ్డి, బాబు, డాక్టర్ మురుగేష్, మురళీ, ఈడిగ శివశంకర్, లోకేష్, గిరిధర్, మధుసూదన్‌రెడ్డి, వైద్యులు ఆదిత్య, లాల్‌పాల్, గంగ, జయసందీప్, లలిత, నరేష్, సిబ్బంది సురేష్, స్వాతి, ప్రగ్య పాల్గొన్నారు.

అస్సోం మారణ హోమాన్ని నివారించాలి



ఇందిరాసర్కిల్‌లో నిరసన తెలుపుతున్న ఎస్‌డీపీఐ నాయకులు

పుంగనూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అస్సోంలో జరుగుతున్న మారణ హోమాన్ని నివారించాలంటూ ఎస్‌డీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఇందరాసర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్‌డీపీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమ్మద్ చాంద్‌బాషా, నాయకులు యూసుఫ్, యూనుఫ్, జమీర్‌లాల్, జాబివుల్లా, ఏజాజ్, ఖాదర్‌బాషా, శమీర్, వాసీమ్, మహమ్మద్‌అలీ, అతిక్, హుజెఫ్, అసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ శమీపతికి సన్మానం



శమీపతిని సన్మానిస్తున్న టీడీపీ మండల నాయకులు

పుంగనూరు రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నూతనంగా పుంగనూరు ఏఎంసీ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన నల్లబాల శమీపతిని పుంగనూరు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి అధ్యక్షతన శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఇబ్రహీం, ప్రసాద్‌స్వామి, చైతన్య రాయల్, నరేశ్‌రాయల్, రామకృష్ణానాయక్, వేణు, గంగులప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ జాతర



కరకమందలో ఎల్లమ్మ దేవతకు పూజలు చేస్తున్న భక్తులు

సోమల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడింపల్లె పంచాయతీ కరకమందలో కొలువుతీరిన ఎల్లమ్మ దేవత ఆలయంలో జాతర వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. భక్తులు ఉపవాస దీక్షలతో చెన్నమల్లయ్యతాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని అమ్మవారి ఆయుధాలను, పూజా సామగ్రిని ఊరేగింపుగా గ్రామ సమీపంలోని బాపన చెరువు వద్దకు తీసుకెళ్లి శాస్త్రోక్తంగా గంగస్నానం చేయించారు. యువకుల కత్తి విన్యాసాలు, చెక్కభజనలు, కోలాటాల నడుమ కోలాహలంగా సాగింది. నడింపల్లె, కరకమంద, సూరయ్యగారిపల్లె, సోమల, చెన్నయ్యగారిపల్లె, సదుం, గట్టువారిపల్లె మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఉభయదారులు మూలింటి నారాయణ, గజ్జెల కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి పూర్ణిమాదేవి

కల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పాకాల జూనియర్ సివిల్ జడ్జి పూర్ణిమాదేవి తెలిపారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ న్యాయం చేయడానికి న్యాయస్థానం ఉందని, పేదలకు ఉచితంగా ప్రతి కోర్టులో ఉచిత న్యాయ సలహాలు అందిస్తున్నామన్నారు. ర్యాగింగ్ చట్ట విరుద్ధమని.. విద్యార్థులను ర్యాగింగ్ పేరిట వేధిస్తే ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. ప్రభుత్వం డీకేటీ భూములను అర్హులకే ఇవ్వాలన్నారు. డబ్బులు అప్పుగా తీసుకునే సమయంలో ఖాళీ బాండులో సంతకాలు చేయరాదని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు జయసింహ, ఎంపీడీవో రాజశేఖర్, ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య, న్యాయవాదులు ఎస్ఎన్ఎం సలీం, గురుస్వామినాయుడు, చంద్రమోహన్, ప్రవీణ్‌ప్రకాష్, సునీల్ పాల్గొన్నారు.

నేడు రామకుప్పంలో ఉచిత కంటి వైద్యశిబిరం

రామకుప్పం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం రామకుప్పం వల్లీదేవసేన సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలో ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు సీతాపతి తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే ఈ శిబిరంలో నిపుణులైన కంటి వైద్యులచే రోగులకు కంటి పరీక్షలు, చికిత్సలు చేయిస్తామన్నారు. అర్హులైన రోగులను పీఈఎస్ ఆస్పత్రికి తరలించి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని ఆయన తెలిపారు.

వెంకటాద్రి కాలనీలో దాహం



వెంకటాద్రి కాలనీలో తాగునీటి కోసం గ్రామస్తుల పడిగాపులు

పుంగనూరు రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ వెంకటాద్రి కాలనీ, శాంతినగర్ కాలనీల్లో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం తాగునీటి కోసం వేసిన బోరులో నీటి మట్టం తగ్గిపోవడంతో సమస్య ఏర్పడినట్లు కాలనీ వాసులు వాపోతున్నారు. రెండు కాలనీల్లో దాదాపు 200 కుటుంబాలు కాపురాలు ఉన్నట్లు తెలిపారు. తాము కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నామని.. నీటి సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా ఫలితం లేదన్నారు. అధికారులు స్పందించి కాలనీలో తాగునీటి సమస్య తీర్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



వైసీపీ నాయకుడు రామచంద్రయ్యను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో శనివారం పులిచెర్ల మండలంలోని ఎల్లంకివారిపల్లి పంచాయతీ సాధుబడివారిపల్లికి చెందిన వైసీపీ నాయకులు రామచంద్రయ్య, జయప్రకాష్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ టీడీపీలో చేరిన వీరికి తగిన గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, విండో అధ్యక్షులు ధనంజయనాయుడు, ఎంపీటీసీ మునికృష్ణమనాయుడు, మురళీధర్‌నాయుడు, సురేష్‌నాయుడు, గోపినాయుడు, శంకర్, దేవ, పరంధామనాయుడు, జయచంద్రనాయుడు, పార్థసారథినాయుడు పాల్గొన్నారు.

కుంభాభిషేక మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో పెద్దమావూరి యల్లమ్మ

రొంపిచెర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ గుట్టకింద హరిజనవాడలోని పెద్దమావూరి యల్లమ్మ, గురప్పస్వామి ఆలయంలో శనివారం ఘనంగా మహా కుంభాభిషేక మహోత్సవం జరిగింది. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యాప్రమాణాలు పెంపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈవో ఇందిర

రొంపిచెర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల విద్యాప్రమాణాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు పనిచేయాలని చిత్తూరు డీవైఈవో ఇందిర అన్నారు. శనివారం మండలంలోని బొమ్మయ్యగారిపల్లె, రొంపిచెర్ల బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సీఆర్‌సీ సమావేశం జరిగింది. ఎంఈవో శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మి, చిన్నయ్య, అమరశేఖర్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ



రామకుప్పం మండలం ఆనిగానూరులో అవగాహన ర్యాలీ



పుంగనూరు: కళాశాలలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు



పలమనేరులో నూలు సంచులు అందిస్తున్న మున్సిపల్ కమిషనర్

వి.కోట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంతోనే మానవ మనుగడ సాధ్యమని ఎంపీడీవో ఈశ్వరన్ అన్నారు. శనివారం పర్యావరణ జాగృతి కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులచే పచ్చదనం ప్రాముఖ్యతను వివరిస్తూ అవగాహన ర్యాలీ చేపట్టారు. ఖాళీ మైదానాల్లో విరివిగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈవో శ్రీనాథరెడ్డి, హెచ్ఎంలు వెంకటరమణ, చంద్రమతి, ఏఎస్ఐ జయకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** పరిసరాల శుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని టీడీపీ విజలాపురం యూనిట్ ఇన్‌చార్జి రామ్మూర్తి కోరారు. శనివారం మండల పరిధి ఆనిగానూరు ఉన్నత పాఠశాలఉపాధ్యాయులు, విద్యార్థులు స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర అవగాహన ర్యాలీలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బీరప్ప, ప్రధానోపాధ్యాయుడు ఆదిశేషయ్య పాల్గొన్నారు.

● **సోమల:** సోమల మండలం కందూరులో సచివాలయ అధికారులు, నెల్లిమంద, సోమల, ఇరికిపెంట, నంజంపేట గ్రామాల్లో విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, సింగిల్‌విండో అధ్యక్షుడు శివశంకర్, పి. శ్రీనివాసులు, కార్యదర్శులు జయశంకర్, మణికుమార్, హెచ్ఎంలు ఎల్లయ్య, శివరాజ తదితరులు పాల్గొన్నారు.

● **పుంగనూరు:** పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణ పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులు వాడరాదని కోరారు. స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో పరిశుభ్రతలో భాగంగా పిచ్చి మొక్కలు తొలగించారు. కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సోమంజు, అధ్యాపకులు రాజశేఖర్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **రొంపిచెర్ల:** రొంపిచెర్లలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ప్లాస్టిక్ నిర్మూలనపై పట్టణ వీధుల్లో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో శ్రీనివాసులు, పంచాయతీ ఈవో సత్యంరెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె:** స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని తీర్థం గ్రామంలో పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారులు కాంతమ్మ, సావిత్రి, సీహెచ్‌వో జయంతి, హెల్త్‌అసిస్టెంట్ రాజారెడ్డి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

● **పలమనేరు:** ప్రజలందరూ ప్లాస్టిక్ వినియోగాన్ని విరమించుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ సిబ్బందితో పాటు మెప్మా మహిళలు, మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, మెప్మా సీఎంవో బాబా పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● చల్లా రామచంద్రారెడ్డి



దిగుమూర్తివారిపల్లిలో చల్లాను సత్కరిస్తున్న ప్రజలు

కల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి పంచాయతీ దిగుమూర్తివారిపల్లిలో శనివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో చల్లా రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు జయసింహ, ఎంపీడీవో రాజశేఖర్, ఏపీవో సౌభాగ్యవతి, ఏపీఎం చంద్రమోహన్, టీడీపీ నాయకులు ఉయ్యాల రమణ, ధనంజయ నాయుడు, కుమార్‌రెడ్డి, మురళీధర్ నాయుడు, సుబ్బారెడ్డి, మునికృష్ణమ నాయుడు, గోపి నాయుడు, శంకర్, సురేష్‌నాయుడు, దేవ, పరంధామనాయుడు, జయచంద్రనాయుడు, మురళీనాయుడు, తేజ, మనోహర్‌శెట్టి, పార్థసారధినాయుడు, ధనంజయ నాయుడు, సురేంద్ర, చెంగ్రాయ నాయుడు, అరుణాచలం నాయుడు, గురుమూర్తి, నాగరాజ నాయుడు, రవి, రాజగోపాల్ నాయుడు, ప్రసాద్, కిషోర్ పాల్గొన్నారు.

● **రామకుప్పం:** ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరిస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందని ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సీతాపతి, రామకుప్పం-1 క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి తెలిపారు. శనివారం రామకుప్పం పట్టణంలో ప్రధాన రహదారిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మాట్లాడారు. మాజీ సర్పంచి రామకృష్ణప్ప, కడ సలహా కమిటీ సభ్యుడు రఘు, టీవీ రవి, సురేష్, నేతలు ఆదిల్, బాలరాజు, సుబ్రీ, మంజునాథ్, చాంద్ బాషా, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

● **రొంపిచెర్ల:** సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శ్రీరాములువడ్డిపల్లె, మూరేవాండ్లపల్లె, పిచ్చికుంటవారిపల్లెలో టీడీపీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. చెంచమరెడ్డిగారిపల్లె బూత్ కమిటీ అధ్యక్షుడు చెంగల్‌రెడ్డి, రఘునాథ్, గ్రామకమిటీ అధ్యక్షుడు రామూర్తి, మాధవరావు, సత్యం, అశ్విన్, మహేష్ పాల్గొన్నారు.

● **వి.కోట:** మండల పరిధిలోని వి.కోట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఈశ్వర్‌నగర్, పత్రపల్లె, పాపేపల్లె, గాండ్లపల్లె గ్రామాల్లో శనివారం సుపరిపాలనలో తొలిడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, శనివారం ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, జిల్లా తెలుగు యువత కార్యదర్శి శబరీష్, మండల తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, నేతలు జనార్థన్‌రెడ్డి, సురేంద్ర, ఇకాల్, హరినాథ్, ముకుంద, రాము, నారాయణ స్వామి, వెంకట్రామప్ప, కమల్‌రాజు, వెంకట్రామ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి

పలమనేరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : వీధి వ్యాపారులు తమ వ్యాపారాల కోసం అధిక వడ్డీలకు పోకుండా ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి సూచించారు. శనివారం పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో వీధి వ్యాపారుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, మెప్మా సీఎంవో బాబా, వీధివ్యాపారులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలను ధ్రువీకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారిణి బి.శ్రీదేవి

పలమనేరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ వార్డు సభలు నిర్వహించి బంగారు కుటుంబాలను ధ్రువీకరించాలని పలమనేరు నియోజకవర్గ పీ4 ప్రత్యేకాధికారిణి బి.శ్రీదేవి సూచించారు. శనివారం పలమనేరు మున్సిపల్ మీటింగ్ హాల్లో పీ4పై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి వార్డులో వార్డు సభలు నిర్వహించి జాబితాలో వ్యత్యాసాలను సరిదిద్దడం, మార్గదర్శకాలు, అర్హత, ప్రమాణాల ప్రకారం గృహాలను జోడించడం, తొలగించడం, తుది జాబితాను సంబంధిత సచివాలయాలలో ప్రదర్శించడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి, మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, ఎంపీడీవో భాస్కర్, ఎంఈపీఎంఎ సీఎంఎం వి.బాబా, ఇండియన్ బ్యాంకు మేనేజర్ అశోక్ కుమార్, ఎస్.ఐ. లోకేష్ , ఆర్పీలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పట్టభద్రుల దినోత్సవం



హాజరైన పట్టభద్రులు

గంగవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండలంలోని మదర్ థెరీసా కళాశాలలో శనివారం పట్టభద్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు విద్యార్థులను అభినందిస్తూ ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సునీల్, డైరెక్టర్లు రాజేంద్ర రెడ్డి, డాక్టర్ రాజకుమార్, ప్రిన్సిపాల్ ప్రభాకర నాయుడు, హెచ్‌వోడీలు మురళీమోహన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలపై గజరాజుల దాడులు



ధ్వంసమైన మామిడిచెట్లు

కల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతున్నాయి. మండలంలోని దేవళంపేట పంచాయతీలో శుక్రవారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో మామిడి, వంకాయ, మిరప పంటలకు అపారనష్టం వాటిల్లింది. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని నుంచి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు కుమ్మరిపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతులు చంద్రమోహన్, వెంకటాచలం, ధర్మేంద్ర, రామనాధం, గోవిందయ్యకు చెందిన మామిడిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. రైతు వెంకట్రామయ్యకు చెందిన వంకాయ, మిరప పంటను ఏనుగులు తొక్కేశాయి. తుడుంవారిపల్లిలోని రైతు వెంకటశిద్దులుకు చెందిన వంకాయ, పశుగ్రాసం, మునగచెట్లను ధ్వంసం చేశాయి. రైతు బాబుకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను ఏనుగులు విరిచేశాయి. అనంతరం వచ్చిన దారిలోనే ఏనుగుల గుంపు అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. శనివారం పగలంతా అడవిలోని సూరప్పచెరువు వద్ద ఏనుగుల గుంపు తిష్ట వేసినట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి తెలిపారు.

మంగల్‌పాండేకు నివాళులు



మంగల్‌పాండేకు నివాళులర్పిస్తున్న తాతయ్యనాయుడు తదితరులు

పలమనేరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరు బీజేపీ కార్యాలయంలో శనివారం స్వాతంత్ర్య సమరయోధులు మంగల్‌పాండే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పట్టణ బీజేపీ అధ్యక్షులు తాతయ్యనాయుడు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆర్ఎస్ఎస్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కోనేటిరాయస్వామి ఆలయంలో రద్దీ



కీలపట్ల కోనేటిరాయస్వామి ఆలయంలో లడ్డూల కోసం క్యూకట్టిన భక్తులు

గంగవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : గంగవరం మండలంలో టీటీడీ పరిధిలో ఉన్న కోనేటి రాయస్వామి ఆలయంలో శనివారం లడ్డూల కోసం భక్తులు అధిక సంఖ్యలో క్యూ కట్టారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి శనివారం తిరుమల లడ్డూలను ఇక్కడ విక్రయిస్తారు. తిరుమలకు వెళ్లలేక చాలామంది గ్రామీణ ప్రజలు, పట్టణ వాసులు ప్రతి శనివారం అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి ఇక్కడి కోనేటి రాయస్వామిని దర్శించుకొని తిరుమల లడ్డూ ప్రసాదాలను కొనుగోలు చేసుకొంటున్నారు. శనివారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకొని లడ్డూ ప్రసాదం కోసం క్యూలో వేచి ఉన్నారు.

నక్కపల్లి చెరువు కట్టపై గండి



నక్కపల్లి చెరువు కట్టపై పడిన గండిని పరిశీలిస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు

పలమనేరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలంలోని నక్కపల్లి చెరువు కట్టపై ఏర్పడిన గండిపై ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం ఇరిగేషన్ శాఖ డీఈ చొక్లానాయక్, ఏఈ లక్ష్మీనారాయణ చెరువు వద్దకు చేరుకొని కట్టపై ఏర్పడిన గండిని పరిశీలించారు. గండి పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.

తెప్పలపై కోదండరాముడి విహారం



తవణంపల్లె, జూలై 19 (ఆంధ్రజ్యోతి): టి.పుత్తూరు కోదండరామాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారు తెప్పలపై విహరించారు. ఉదయం స్వామివారికి నిత్యకైంకర్యాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవర్లకు ఊంజల్‌సేవ నిర్వహించాక తెప్పలపై అధిష్టింపజేసి, ఆలయ పుష్కరిణిలో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి, ఉభయదారులు, టి.పుత్తూరు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తాం: టీడీపీ



గొల్లకండ్రిగలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పాలసముద్రం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరిస్తామని టీడీపీ నాయకులు అన్నారు. శనివారం గొల్లకండ్రిగ, జయలక్ష్మీపురం గ్రామాల్లో ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి అరుళ్‌నాథన్ ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలపై కరపత్రాలను పంపిణీ చేస్తూ.. అమలు తీరుపై ఇంటింటికీ వెళ్లి ఆరా తీశారు. సమస్యలను ఎమ్మెల్యే థామస్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. నాయకులు రోసినాయుడు, సురేష్, పురుషోత్తం, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం

పాలసముద్రం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదామని పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హేమలత పిలుపునిచ్చారు. 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో కలిసి కళాశాల, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. అధ్యాపకులు సూర్య, సుశీల, రమ్య పాల్గొన్నారు.

గుడిపాల: మండలంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దామని ఎంపీడీవో శిరీష అన్నారు. శనివారం 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా వసంతాపురం గ్రామ పంచాయతీలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులతో కలసి తొలగించి, ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎస్బీఎం ఎంసీవో రాజ్‌కుమార్, కార్యదర్శి సుందరేశన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని కార్వేటినగరం మండలంలోని కత్తెరపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.చెంగల్రాజు పిలుపునిచ్చారు. శనివారం పాఠశాలలో ప్లాస్టిక్ కాలుష్యం నుంచి విముక్తి అనే అంశంపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ● వెదురుకుప్పం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లె, మొండివెంగనపల్లె, పాతగుంట గ్రామ పంచాయతీ కేంద్రాల్లో ఎంపీడీవో పురుషోత్తం మొక్కలను నాటి నీరు పోశారు. బ్రాహ్మణపల్లెలో ఇంటింటికీ చెత్త సేకరణ పనులను తనిఖీ చేశారు.

చిత్తూరు అర్బన్: పరిసరాల పరిశుభ్రతే ముఖ్యమని ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్ చెప్పారు. 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం పోలీసు వెల్ఫేర్ ఆస్పత్రిలో అధికారులు, సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌బాష, ఆర్‌ఐ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ అనుమానిత కేసు

చిత్తూరు రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీచవటపల్లె ప్రాంతంలో డెంగీ అనుమానిత కేసు నమోదైంది. ఆ ఇంటి పరిసరాలను శనివారం జిల్లా మలేరియా నివారణ అధికారి వేణుగోపాల్ పరిశీలించి, రసాయనాలను స్ప్రే చేయించారు. వైద్యాధికారి దిలీప్‌కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వైద్యాధికారులు అందుబాటులో ఉండాలి: డీఐవో

పూతలపట్టు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐవో) డాక్టర్ హనుమంతరావు ఆదేశించారు. శనివారం పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో ఉన్న బందార్లపల్లెలో జరిగిన ఔట్‌రీచ్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, ఆరోగ్య కార్యకర్త రాణి, ఆశా వర్కర్ కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

22న జీడీనెల్లూరు మండల మీట్

గంగాధరనెల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జీడీనెల్లూరు మండల సర్వసభ్యసమావేశం ఈనెల 22వతేదీ ఉదయం 10 గంటలకు ఎంపీపీ అనిత అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి తెలిపారు. అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని, వివిధశాఖల అధికారులు గత సమావేశానికి సంబంధించి నివేదికలు అందజేయాలని కోరారు.

స్వచ్ఛాంధ్ర సాధిద్దాం

నగరి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అందరం కలిసికట్టుగా పనిచేసి స్వచ్ఛాంధ్ర సాధిద్దామని నగరి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ కార్యాలయం నుంచి టవర్‌క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఎంపీడీవో కార్యలయ ఆవరణలో ఎంపీడీవో కృష్ణయ్య మొక్కలు నాటారు. బుగ్గకండ్రిగ పాఠశాలలో హెచ్‌ఎం రవీంద్రబాబు మొక్కలు నాటారు.

ప్లాస్టిక్ బాటిల్ సేకరణ కేంద్రం ఏర్పాటు



చిత్తూరు అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గాంధీ సర్కిల్ బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ బాటిళ్ల సేకరణ కేంద్రాన్ని కమిషనర్ నరసింహ ప్రసాద్, సీఐ మహేశ్వర కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కార్యదర్శులు, స్వయం సహాయక సభ్యులు, అన్ని వార్డుల పరిధిలోని కళాశాలలు ఇతర జన సమ్మర్థ ప్రాంతాల్లో సుమారు 10వేల గుడ్డ బ్యాగులను పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదు: ఈఈ

చిత్తూరు రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు 220 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం తొమ్మిది ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈఈ మునిచంద్ర ప్రకటించిన విషయం తెలిసిందే. కొన్ని అనివార్య కారణాలతో సబ్‌స్టేషన్ మరమ్మతులను వాయిదా వేయడంతో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదని పేర్కొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

పెనుమూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందామని జడ్పీ స్కూల్ హెచ్‌ఎం రమేష్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా పెనుమూరు బస్టాండులో జూనియర్ కాలేజీ, హైస్కూల్ విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, తలారిరెడ్డెప్ప, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ రామచంద్ర, సెక్రటరీ ప్రభుకిరణ్, అధ్యాపకులు మురుగన్, ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిపోతున్న మట్టి



ట్రాక్టర్‌లో తమిళనాడుకు తరలిపోతున్న మట్టి

పాలసముద్రం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు సమీపంలో పాలసముద్రం, సింహరాజపురం, వనదుర్గాపురం, గంగమాంబాపురం, బాలకృష్ణాపురం, కోదండరామాపురం పంచాయతీల్లోని గ్రామాలున్నాయి. ఈ గ్రామాల నుంచి మట్టిని కొందరు వైసీపీ నాయకులు అక్రమంగా తమిళనాడుకు తరలించేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వీరికి మండల రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారని స్థానికులు గతంలోనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన కూడా రెవెన్యూ సిబ్బందిని మందలించినట్లు సమాచారం. కాగా, పాలసముద్రం మండలం జిల్లా కేంద్రానికి 35 కిలోమీటర్ల దూరంలో ఉన్నా- ఉన్నతాధికారులు ఇటువైపు సరిగా రాకపోవడం వల్లే మండల అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

ప్లాస్టిక్ రహిత నగరంగా చిత్తూరును మారుద్దాం

● ఎమ్మెల్యే జగన్మోహన్ పిలుపు



కార్మికులతో 'స్వచ్ఛాంధ్ర' ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత నగరంగా చిత్తూరును మారుద్దామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పిలుపునిచ్చారు. 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం కొంగారెడ్డిపల్లెలో 'స్వచ్ఛత- ప్లాస్టిక్ నిర్మూలన' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు సూచించారు. కమిషనర్ నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ.. వస్త్రాలతో తయారు చేసిన బ్యాగులను ప్రోత్సహిస్తామని తెలిపారు. నగరపాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, స్వచ్ఛ సర్వేక్షణ్-2024 ఫలితాల్లో చిత్తూరు నగరపాలక సంస్థ ఉత్తమ ర్యాంకులు సాధించడంపై కమిషనర్‌తోపాటు ఎంహెచ్‌వో లోకేష్ తదితరులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సత్కరించారు.

సారా రహిత రాష్ట్రమే సీఎం లక్ష్యం

● ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్



సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీనివాస ఆచారి

పాలసముద్రం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని సారా రహితంగా చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస ఆచారి తెలిపారు. నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా శనివారం నరసింహపురం(అయ్యవారికండ్రిగ)లో గ్రామస్తులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సారా తయారీ, అమ్మకాలు మానుకుని ఇతరవృత్తులు ఎంచుకుని జీవనం సాగించాలన్నారు. దీనికోసం బ్యాంకు రుణాలు ఇప్పించి, తోడ్పాటు అందిస్తామన్నారు. చదువుకున్న యువతకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసన్, ఏఈఎస్‌లు కృష్ణకిషోర్, సుబ్రహ్మణ్యం, కార్వేటినగరం ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి, తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో సతీష్, మాజీ ఎంపీపీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్ స్వాధీనం



ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నింద్ర, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్‌వీఎం పురం పంచాయతీ అమ్మయ్యప్పన్ కంపెనీ సమీపంలో అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక డంప్‌ను తహసీల్దార్ శేషగిరిరావు శనివారం సీజ్ చేశారు. పోలీసులు పరిశీలించగా అక్కడ ఎవరూ లేరన్నారు. ఆరు ట్రాక్టర్ల ఇసుక ఉంటుందని తెలిపారు.

ప్రహరీ తొలగింపు



ప్రహరీని తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

చిత్తూరు అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): హైరోడ్డు విస్తరణలో భాగంగా శనివారం కట్టమంచి వద్ద పనులు కొనసాగాయి. వంద అడుగుల స్థలం కోసం ఓ ప్రైవేటు వ్యక్తికి చెందిన ప్రహరీని, భవనాన్ని ఎక్స్‌కవేటర్ల సాయంతో తొలగించారు. పనులను ఏసీపీ నాగేంద్ర పర్యవేక్షించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశాలతో హైరోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని, ప్రజలు సహకరించాలని కోరారు.

'పాళ్యంకొండ అభివృద్ధికి సహకరించండి'



సమావేశంలో ప్రసంగిస్తున్న గుర్రప్పనాయుడు

గుడిపాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పాళ్యంకొండ అభివృద్ధికి సహకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ గుర్రప్పనాయుడు, వైస్ చైర్మన్ మోహన్ విన్నవించారు. శనివారం పాళ్యంకొండ వద్ద ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆలయం వద్ద ప్రస్తుతం నిర్వహిస్తున్న అభివృద్ధి పనులకు దాతల సహకారం అందించాలన్నారు. కాలినడకలో ప్రస్తుతం 250 మెట్లు నిర్మించామని చెప్పారు. ఆలయ ట్రెజరర్ తారకరామ్, కమిటీ సభ్యులు రాజు, డిల్లీబాబు, రాజ్‌గోపాల్‌నాయుడు, గోవిందస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు స్వాగతం

నగరి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుకు శనివారం తిరుపతి విమానాశ్రయంలో రామానుజం చలపతి, లత ఆధ్వర్యంలో నగరి తెలుగు మహిళలు స్వాగతం పలికారు.

ఇద్దరి మధ్య ఘర్షణ: గాయాలు

శ్రీరంగరాజపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పిళ్లారికుప్పం దళితవాడలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పిళ్లారికుప్పం దళితవాడకు జగన్నాథం, మునస్వామికి భూతగాదాలు ఉన్నాయి. శనివారం వీరిద్దరి మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఇద్దరూ ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో గాయపడ్డారు. బాధితులను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారిద్దరూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

అంతర పంటల సాగుతో అధిక లాభాలు



పంటలను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు

నగరి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అంతర పంటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జి.వాసు తెలిపారు. నగరి మండలంలోని వేలావడిలో శనివారం రైతు రామకృష్ణ పొలంలో సాగుచేసిన ఆయిల్‌పామ్ తోటలో నవధాన్యాల సాగును పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ అధికారి గురు, మాస్టర్ ట్రైనర్ చంద్రశేఖర్, మోడల్ మేకర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీటీడీ కార్మిక పరిషత్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా చెన్నకేశవులు



చెన్నకేశవులు నాయుడిని సన్మానిస్తున్న నాయకులు

చిత్తూరు రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఏపీపీటీడీ కార్మిక పరిషత్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా గురజాల చెన్నకేశవులు నాయుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏపీపీటీడీ కార్మిక పరిషత్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఆర్టీసీ అభివృద్ధిబాటలో పయనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు సురేంద్రకుమార్, చంద్రప్రకాష్, కోదండ యాదవ్, టీఎన్‌టీయూసీ నాయకులు మాధవనాయుడు, కార్మిక పరిషత్ నాయకుడు హరిప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా నేత మృతి



పాల్‌రాజ్ (ఫైల్ ఫొటో)

గంగాధరనెల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు, గంగాధరనెల్లూరు దళితవాడకు చెందిన పాల్‌రాజ్ అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ నేతలు దేవపత్ని ధనంజయనాయుడు, దేవసుందరం, స్వామిదాస్, శివప్రసాద్, కిరణ్‌నాయుడు, హరీష్ యాదవ్, బీజేపీ నేతలు రాజేంద్రన్, సుధాకర్, ఆనంద్‌బాబు, మురళి, నారాయణ ఆచారి, వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి, వైస్ ఎంపీపీ హరిబాబు తదితరులు నివాళులర్పించారు.

దేవదాయశాఖ కార్యాలయాన్ని తరలించొద్దు: సీపీఐ



చిట్టెమ్మకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

చిత్తూరు కల్చరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా దేవదాయశాఖ కార్యాలయాన్ని తరలించొద్దని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కార్యదర్శి నాగరాజన్ ఆధ్వర్యంలో శనివారం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జిల్లా దేవదాయ శాఖ అధికారి చిట్టెమ్మకు వినతి పత్రం అందజేశారు.

కృష్ణమ నాయుడికి సన్మానం



గంగాధరనెల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు ఏఎంసీ చైర్మన్‌గా నియామకమైన ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు శనివారం టీడీపీ నాయకులు సన్మానించారు. నాయకులు శ్రీధర్‌యాదవ్, గుంటూరు దేవరాజులునాయుడు, జ్యోతియాదవ్, వెంకటేష్‌నాయుడు, సోమశేఖర్‌నాయుడు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అసోంలో మైనార్టీలపై దాడులు ఆపండి: ఎస్డీపీఐ



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ఎస్డీపీఐ ప్రతినిధులు

చిత్తూరు కల్చరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అసోంలో మైనార్టీలపై దాడులు ఆపాలని సోషియల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్డీపీఐ) ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ మేరకు ధర్నా నిర్వహించారు. కరీం, సైఫుల్లా, గఫర్‌భాయ్, యూసఫ్ బాయ్, ఆరీఫ్, ఖాలిక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..



తిరుపతి విమానాశ్రయంలో సీఎం చంద్రబాబును కలిసిన బంగారుపాళ్యం మండల టీడీపీ అధ్యక్షుడు ఎస్వీ ధరణీప్రసాద్

పీహెచ్‌సీలో పరిశీలన



సిబ్బందికి సూచనలిస్తున్న వెంకట ప్రసాద్

తవణంపల్లె, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె పీహెచ్‌సీని జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ శనివారం పరిశీలించారు. ఏఎన్‌ఎంలకు, ఆశా కార్యకర్తలకు పలు సూచనలిచ్చారు. మండల వైద్యాధికారులు మోహనవేలు, కేశవ నారాయణ, సీహెచ్‌వో జ్ఞానశేఖర్, పీహెచ్‌ఎన్ జీవకళ, సిబ్బంది పాల్గొన్నారు.

26న రామాయణ నృత్యరూపకం

చిత్తూరు కల్చరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నాగయ్య కళాక్షేత్రంలో నటరాజ నాట్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో రామాయణ నృత్య రూపక ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపకుడు కిషోర్ తెలిపారు. 20 మంది కళాకారులతో దాతల సహకారంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వన వేణుగోపాలుడికి పూజలు



వెదురుకుప్పం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆలయ ప్రధాన కార్యనిర్వాహకుడు శివకుమార్ పర్యవేక్షించారు.

'స్వచ్ఛాంధ్ర'పై అవగాహన ర్యాలీ

వెదురుకుప్పం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో శనివారం ఎంపీడీవో చంద్రమౌళి ఆధ్వర్యంలో ఉద్యోగులు 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తర్వాత ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. మొక్కలు నాటి, నీరు పోశారు. పర్యావరణం, పచ్చదనంపై అవగాహన కల్పించారు. అలాగే ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో పారిశుధ్య నిర్వహణ పనులను చేశారు. డిప్యూటీ ఎంపీడీవో టీవీ మధుసూదన్, ఉద్యోగులు హాజరయ్యారు.

ఆరిమాని గంగమ్మకు పూజలు



శ్రీరంగరాజపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గంగమ్మగుడి గ్రామంలోని ఆరిమాని గంగమ్మకు శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు వెంకటాచలపతి, కమిటీ సభ్యులు పైనేని ధనంజయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కించపరచొద్దు: వైసీపీ

నగరి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరచొద్దని వైసీపీ మహిళా నేతలు అన్నారు. మాజీ మంత్రి రోజాను ఉద్దేశించి ఎమ్మెల్యే భానుప్రకాష్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ నగరి బస్టాండులోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. టవర్‌ క్లాక్ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. నాయకులు అముద, వరలక్ష్మి, తేన్‌మొళి, చినపాప, సాయిసంధ్యారాణి, నీలమేఘం, రమేష్‌రెడ్డి, తిరుమలరెడ్డి, బాలకృష్ణ, బాలన్,కన్నెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను ఇష్టానుసారం మాట్లాడలేదా?

● మాజీ మంత్రి రోజాపై టీడీపీ నేతల ఆగ్రహం

నగరి/విజయపురం/నింద్ర, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను ఇష్టానుసారం మాట్లాడలేదా? అంటూ మాజీ మంత్రి రోజాపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరి టీడీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రూ.2వేలకు యాంకర్‌గా చేసి రోజాకు నేడు రూ.2వేల కోట్లు ఎలా వచ్చాయో నగరి ప్రజలకు బాగా తెలుసని ఎమ్మెల్యే అన్నారన్నారు. దాన్ని పట్టుకుని మహిళను అసభ్యంగా మాట్లాడారంటూ గందరగోళం సృష్టించడం తగదన్నారు. నగరి మండల టీడీపీ అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి శ్రీనివాసన్, మండల కార్యదర్శి వేణు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి మీరా పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే విజయపురం మండలంలోని మహారాజపురంలోనూ, నింద్రలోనూ టీడీపీ నాయకులు ఇదే అంశంపై ప్రసంగించారు. మహారాజపురంలో జరిగిన సమావేశంలో టీడీపీ నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, బాబుయాదవ్, బాబునాయుడు, తదితరులు పాల్గొన్నారు. నింద్రలో జరిగిన సమావేశంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వరరావు, రవినాయుడు, పెరుమాల్ రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.